సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం, 12, మే, 2023



చెరకు గానుగ.. కనుమరుగు

గ్రామాల్లో గతంలో చెరకు గానుగలు ఎక్కువగా కనిపించేవి.. ప్రస్తుతం అవి కనుమరుగవుతున్నాయి. -IIలో..



ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులు

ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. -IIలో..



రైల్వే ప్రయాణికుల రక్షణకు కృషి


రైల్వే ప్రయాణికుల రక్షణకు అన్ని చర్యలు చేపడతామని కడప రైల్వే సీఐ నాగరాజు తెలిపారు. -IIలో..

చరిత్ర వెలుగు చూసేనా!

- సీమ బౌద్ధారామాల వద్ద... తవ్వకాలకు నాలుగు దశాబ్దాలుగా బ్రేక్
- మరుగున పడిన గుహల చరిత్ర



బౌద్ధారామాల వద్ద ఉన్న గుహ(రహస్యదారి)



నందలూరులోని బౌద్ధారామం

రాజంపేట: నందలూరు–ఆడపూరు మధ్య ఉన్న కొండల్లో రాయలసీమలో తొలిసారిగా బౌద్ధారామాలు బయల్పడ్డాయి. వీటి వద్ద ఉన్న సొరంగ మార్గంలో జరిపిన తవ్వకాలకు నాలుగు దశాబ్దాలుగా బ్రేక్ పడింది. 1979 సెప్టెంబర్‌లో జరిపిన తవ్వకాల్లోనే సొరంగమార్గం బయటపడింది. తర్వాత తవ్వకాల ప్రయత్నాలు ముందుకుసాగలేదు. ఫలితంగా గుహల చరిత్ర వెలుగులోకి రాలేకపోయింది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర, పురావస్తు శాఖలు సంయుక్తంగా తవ్వకాలు జరపాలని చరిత్రకారులు కోరుతున్నారు.

రాజరికాలను ప్రతిబింబిస్తూ...

నందలూరును కేంద్రంగా చేసుకుని చోళ, పాండ్య, పల్లవ రాజులే కాకుండా, కాకతీయ, విజయనగర రాజులు పాలించారు. వారు ఈ సొరంగమార్గం ఏర్పాటు చేసుకున్నారని చెబుతున్నారు. నాటి రాజుల రాజరికాలను ప్రతిబింబిస్తూ ఇది బయల్పడింది. ఈ ప్రవేశద్వారం నుంచి లోపలికి వెళ్లగానే విశాలమైన హాలు, మండపం ఉన్నాయి. లోపలిభాగంలో చీకటి నింపుకుని భూ మార్గం ఉంది. దీని గురించి పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. సొరంగమార్గం నందలూరు నుంచి సిద్దవటం రాజమహల్ వరకు ఉండవచ్చునని చరిత్రకారుల అంచనా..

- బౌద్ధారామాలు భద్రత పేరుతో ప్రభుత్వం, పురావస్తుశాఖ అధికార్లు తవ్వకాలను అర్ధంతరంగా ఆపివేశారు. తవ్వకాలు నిలిపివేసి నాలుగు దశాబ్దాలవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం గమనార్హం. కాగా దివంగత సీఎం వైఎస్‌రాజశేఖరరెడ్డి పాలనలో బౌద్ధారామాలను పునరుద్దరించారు. కొంతమేర అభివృద్ధి పనులు చేపట్టారు. అమరావతి ఆంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకున్న క్రమంలో రాజరికానికి రూపంగా నిలిచిన బైరాగి గుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చరిత్రకారులు అంటున్నారు.
- బౌద్ధమత ఔన్నత్యానికి సజీవ తార్కాణాలుగా రాయలసీమలోనే తొలిసారిగా బయల్పడిన నందలూరు బౌద్ధారామాలు నిలిచాయి. బౌద్ధమతానికి పెద్దపీట వేసే దేశాలు రాజధాని నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న క్రమంలో ఆ మతానికి సంబంధించిన ప్రాంతాల అభివృద్ధికి బీజం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకువెళుతోంది.
- నందలూరు మండలం బహుదా(చెయ్యేరు)నదీ తీరాన ఉన్న బౌద్ధారామాల వల్ల రాయలసీమతో కూడా బౌద్ధుల జీవనం ముడిపడిఉందని ఇక్కడి ఆరామాలు స్పష్టీకరిస్తున్నాయి. నందలూరు గ్రామశివార్లలో బైరాగిగుట్ట వద్ద క్రీస్తు పూర్వం మూడో శతాబ్దానికి సంబంధించిన బౌద్ధారామాలు, బౌద్ధమత అవశేషాలు, రాచరికపు చిహ్నాలు బయల్పడ్డాయి.

లభ్యమైన ఆధారాలు ఇవే..

పురావస్తుశాఖ జరిపిన తవ్వకాల్లో 17 చిన్నబౌద్ధరామాలు, 30 వెండినాణేలు, 24 రాగినాణేలు, 116 చిన్న చిన్న మట్టిపాత్రలు, రాతి చెక్కడపు బొమ్మలు, పెంకులు, 13వ కాలంనాటి స్థూపాలు లభ్యమయ్యాయి. బౌద్ధమత ప్రాముఖ్యానికి నిదర్శనంగా ఒక బౌద్ధారామ మంటపానికి సంబంధించిన అవశేషాలు బయల్పడ్డాయి. వీటిని కడపలోని భగవాన్‌మహవీర్ పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచారు.

తవ్వకాలు జరిపించాలి



బౌద్ధారామాలు రాయలసీమలో తొలిసారిగా బయల్పడింది నందలూరులోనే. 1978లో తవ్వకాల విషయం తానే అప్పటి పురావస్తుశాఖ అధికారులు డా.రామచంద్రమూర్తి, వెంకటేశుల దృష్టికి తీసుకెళ్లాను. తవ్వకాలు జరిపారు. తర్వాత ఆగిపోయాయి. ప్రస్తుతం మళ్లీ చేపట్టాల్సిన అవసరం ఉంది. భావితరాలకు పురావస్తు, వారసత్వ సంపదను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం, పాలకులపై ఉంది. – విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, చరిత్రపరిశోధకుడు, కడప

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం



1978లో జరిపిన తవ్వకాల్లో అనేక ఆధారాలు లభ్యమయ్యాయి. అవి కడప మహవీర్ మ్యూజియంలో ఉన్నాయి. మళ్లీ తవ్వకాలు చేయాలనే ప్రతిపాదన ఇప్పటి వరకు పురావస్తుశాఖ పరిగణలో లేదు. అయితే నందలూరు బౌద్ధారామాల వద్ద తవ్వకాలు చేపట్టాలనే అంశం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. –శివకుమార్, ఏడీ, రాష్ట్ర పురావస్తుశాఖ, తిరుపతి

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు జిల్లా ఐటీఐల ప్రిన్సిపాల్/కన్వీనర్ ఎం.జ్ఞానకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ పాస్ లేక ఫెయిలైన అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా iti.ap.gov.in అనే పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవలన్నారు. అభ్యర్థుల తమ దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐలోనైనా రిజిస్ట్రేషన్ చేసుకోవ చ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ తర్వాత తప్పని సరిగా తమ పేరును నమోదు చేసి వివరాలను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించని వారు అడ్మిషన్ పొందేందుకు అర్హులు కారన్నారు. రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్‌ను జూన్ 6వ తేదీ 2023 లోగా నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి



నెరుసుపల్లె వద్ద మామిడి మొక్కలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ యదుభూషనరెడ్డి

చక్రాయపేట : ప్రతి కూలీకి పని కల్పించాలని డ్వామా పీడీ యదుభూషణరెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన మండలంలోని మారెళ్లమడక గ్రామంలో జరుగుతున్న చెక్‌డ్యాం పూడిక తీత పనులు, చక్రాయపేటలో ఫారంపాండ్ పనులు, నెరుసుపల్లె గ్రామంలో ఉద్యాన తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, క్లస్టర్ ఏపీడీ సుబ్బారెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మాతృ మరణాలు తగ్గించాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో మాతృ మరణాల సంఖ్య తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ స్పందన హాలులో ఈ అంశంపై వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి అవసరమైన చికిత్స అందించాలన్నారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండేలా చూడాలన్నారు. గర్భిణులు, బాలింతలను తరుచూ సందర్శించి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెవిటి, మూగ బాలబాలికలకు ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని హెలెన్ కెల్లర్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని చెవిటి– మూగ(బధిర) బాలబాలికలకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ పి.దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 98493 11680, 9966006758 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

'కలికిరి' అక్రమాలపై లోకాయుక్త విచారణ

అనంతపురం: జేఎన్‌టీయూ–అనంతపురం పరిధిలోని కలికిరి ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణాలకు సంబంధించి వెలుగులోకి వచ్చిన అక్రమాలపై లోకాయుక్త విచారణ చేపట్టింది. టెండర్లు, కొటేషన్లు లేకుండా అయిన వారికి పనులు అప్పగించి పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టించినట్లు అందిన ఫిర్యాదుల మేరకు లోకాయుక్త న్యాయమూర్తి స్పందించారు. సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఉన్నత విద్యామండలికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో మండలి ఉత్తర్వులు అందుకున్న జేఎన్‌టీయూ (ఏ) అధికారులు.. కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టిన పనులు, నిధుల కేటాయింపులు తదితర అంశాలపై నివేదిక సిద్ధం చేసే పనిలో పడ్డారు. కళాశాల భవన నిర్మాణాలకు రూ.295.15 కోట్లు కేటాయించగా... ఈ నిధలను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు. భవన నిర్మాణ బాధ్యతలు ఒక ఏజెన్సీకి అప్పగించాలని నిర్ణయించారు. పనుల పర్యవేక్షణకు నోడల్ కమిటీని నియామకం చేశారు. అయితే నోడల్ కమిటీ పరిధి దాటి వ్యవహరించింది. కాంట్రాక్టు సంస్థకు ఇష్టాసారంగా బిల్లులు చెల్లించేలా సిఫార్సులు చేసింది. ఒప్పందం మేరకు రూ.295.15 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉండగా, ఏకంగా రూ.375.46 కోట్లు చెల్లించేశారు. పాలకమండలి ఆమోదం లేకుండానే రూ.80.31 కోట్లు అదనంగా చెల్లించడం వివాదాస్పదమైంది. కలికిరి ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణాల్లో అక్రమాలను తేల్చడానికి విజిలెన్స్ అధికారులు 2020, జనవరి 24న నోటీసులు జారీ చేశారు. గడువు ముగిసేలోపే వివరాలేవీ అవసరం లేదని విజిలెన్స్ అధికారులు మౌఖికంగా వర్సిటీ అధికారులకు తెలిపారు. దీంతో దర్యాప్తు మధ్యలోనే ఆగిపోయింది. అక్రమాలపై తక్షణమే విచారణ చేపట్టాలంటూ లోకాయుక్తలో విద్యార్థి జయపాల్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కదలిక మళ్లీ మొదలైంది.

15న చెస్ టోర్నమెంట్



కడప స్పోర్ట్స్: కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఈనెల 15వ తేదీన అష్రఫ్–ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ నిర్వహిస్తున్నట్లు జిల్లా చదరంగం అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారీ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 83412 55151 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ ఎస్.రమణ

కడప కార్పొరేషన్: విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్. రమణ తెలిపారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫోన్ ద్వారా సమస్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా కడప, ఖాజీపేట, ముద్దనూరు, పోరుమామిళ్ల, సీకేదిన్నె, నందలూరు, పెండ్లిమర్రి మండలాల నుంచి 10 మంది ఫోన్లు చేసి తమ సమస్యలను విన్నవించారు. ఇందులో వ్యవసాయ సర్వీసులకు సంబంధించినవి–2, విద్యుత్ లైన్లకు సంబంధించినవి–4, స్తంబాలకు సంబంధించి–2, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి–1, విద్యుత్ సరఫరాలో అంతరాయం–1 వచ్చాయి. ఈ సమస్యలను పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎస్. చక్రవర్తి, డీఈఈలు పి. సుబ్రమణ్యం, జీవీ సుబ్బారావు, ఏఈ నీరజ, జేఈ లావణ్య పాల్గొన్నారు.

అత్యున్నత వర్సిటీగా వైవీయూను తీర్చిదిద్దుతా

నూతన వీసీ ఆచార్య చింతా సుధాకర్



వేమన విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న వీసీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయాన్ని రానున్న రోజుల్లో దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని వైవీయూ నూతన వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూ నూతన వీసీగా నియమితులైన ఆయన గురువారం ఉదయం విశ్వవిద్యాలయానికి చేరుకోగా రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వీసీ చాంబర్‌లో పూజలు నిర్వహించి లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్‌గా అవకాశం కల్పించిన గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డిలకు కృజ్ఞతలు తెలిపారు. వెనకబడిన జిల్లాలో ఏ లక్ష్యంతో అయితే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారో, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు కృషిచేస్తానని తెలిపారు. వైవీయూ న్యాక్ ఏ గ్రేడ్ సాధించడం వెనుక అధ్యాపకులు, సిబ్బంది శ్రమను ఆయన అభినందించారు. విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులకు కోర్సు పూర్తి కాగానే ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రచించి ముందుకెళ్తామన్నారు.

మహనీయులకు నివాళులు..

విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఉన్న వేమన విగ్రహానికి, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, వైవీయూ వ్యవస్థాపకుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు వైస్ చాన్సలర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య చింతా సుధాకర్‌కు ఇప్పటి వరకు వీసీగా బాధ్యతలు నిర్వహించిన జేఎన్‌టీయూ వీసీ జింక రంగజనార్ధన శుభాకాంక్షలు తెలిపారు.

వైవీయూ డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రథమ, తృతీయ సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను వైవీయూ నూతన వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రనాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డిలతో కలిసి విడుదల చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలను, పరీక్షల విభాగాన్ని వీసీ అభినందించారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ ఒకటి, మూడు సెమిస్టర్ల పరీక్షలు చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం విధానంలో ఈయేడాది ఫిబ్రవరిలో నిర్వహించామన్నారు. ప్రథమ సెమిస్టర్ బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ, ఒకేషనల్ పరీక్షలకు సంబంధించి మొత్తం 5516 మంది విద్యార్థులు హాజరుకాగా 3506 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 63.56 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైందన్నారు. ఇందులో బాలురు 51.9 శాతం, బాలికలు 74.42 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మూడోసెమిస్టర్ బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ పరీక్షలకు మొత్తం 9311 మంది విద్యార్థులు హాజరుకాగా 4577 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 49.16 శాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ఈ పరీక్షల్లో బాలురు 35.60 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 64.17 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. పరీక్షా ఫలితాలు వైవీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణాధికారులు డా. ఆదినారాయణరెడ్డి, డా. వరప్రభాకర్, డా. సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా రీసర్వే ప్రక్రియ

కలెక్టర్ విజయరామరాజు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేష్‌కుమార్‌లు

కడప సెవెన్‌రోడ్స్ : భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులు జిల్లాలో ప్రణాళికాబద్ధగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. గురువారం రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం అమలు, రీ సర్వే స్టోన్ ప్లాంటేషన్ తదితర అంశాలపై కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ సర్వే చేపట్టిన గ్రామాల్లో గ్రౌండ్ టు థింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. రీ సర్వేలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వేపై కలెక్టర్లు, జేసీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో చేపట్టిందని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు రీ సర్వే, భూరికార్డుల స్వచ్ఛీకరణ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. భూ హక్కు పత్రాలను కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు సంతృప్త స్థాయిలో అందాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ వివిధ అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరగాలన్నారు. ఉపాధి హామి పథకంలో కూలీలకు సకాలంలో బిల్లులు అందాలన్నారు. సచివాలయ భవనాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అన్ని రకాల పంటలకు ఈ–క్రాపింగ్ నమోదు తప్పక చేయిచాలని సూచించారు. రీ సర్వేలు పకడ్బందీగా పూర్తి చేయాలని, పెండింగ్ లేకుండా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం చేపడుతున్న కార్యక్రమంలో భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చుక్కల చిక్కులకు చెక్!

- 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగింపు
- యాజమాన్య హక్కులు కల్పిస్తున్న వైఎస్ జగన్ సర్కార్



సాక్షి ప్రతినిధి,కడప: వారంతా ఆస్తులున్నా పేదలు. విలువైన భూములున్నా సొమ్ము చేసుకోలేని దుస్థితి. బిడ్డలు పెళ్లిళ్లు..చదువుల ఖర్చులకు అప్పులు చేయడం మినహా ఆస్తులను విక్రయించలేని పరిస్థితి. అందుకు కారణం ఆయా రైతులకు చెందిన భూముల సర్వే నంబర్లు నిషేదిత జాబితాలో ఉండడమే. గత కొన్నేళ్లుగా కడప నగరం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భూయజమానుల మౌన రోదనకు చెక్ పడింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో నిషేదిత జాబితా నుంచి తొలగించనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి అర్హులకు హక్కులు కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ రికార్డు(ఆర్ఎస్ఆర్)ల్లో చుక్కలున్న భూములు వారసత్వం కాని ఆస్తుల్లా ఉండిపోయాయి. తద్వారా రైతులు విక్రయ హక్కులు కోల్పోయారు. ఎంతోకాలంగా హక్కుదారుల ఆవేదన ఫలితంగా దశాబ్దాలుగా అనుభవంలో ఉండి 1బీ కలిగిన రైతులు భూములన్నింటినీ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. భూములుండీ రైతులకు విక్రయ హక్కులు లేకపోయినా వైనాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. చంద్రబాబు ప్రభుత్వంలో చొరవ లోపించింది. వెరసి ఆ భూములకు నిషేధిత జాబితా నుంచి విముక్తి లభించలేదు. హక్కులు లోపించిన కారణంగా కుటుంబ అవసరాలకు, బిడ్డల ఉన్నతి ఇతరత్రా అవసరాలకు విక్రయించుకొని సొమ్ము చేసుకోలేని దుస్థితిలో హక్కుదారులు ఉండిపోయారు.

హక్కుదారులకు ఉపశమనం...

హక్కుదారులకు స్వేచ్ఛాయుత హక్కులు లేకుండా 22ఏ నిషేధిత జాబితాలో ఆయా రైతుల భూములుండేవి. ఈవిధంగా జిల్లాలో 17,553 సర్వే నంబర్లు పరిధిలో 31,399 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉండిపోయాయి. సుమారు 12వేల మంది రైతులు అవసరాలకు సొమ్ము చేసుకోలేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని అంచనా. అలాంటి వారికి ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తోంది. యాజమానులకు విక్రయ హక్కులను కల్పిస్తున్నారు. ఇదివరకే ఉత్తర్వులు వెల్లడించినా, శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లా కావలిలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. క్షేత్రసాయిలో వాస్తవ పరిస్థితిని సమీక్షించి, యజమానులకు స్వేచ్ఛాయుత హక్కులను కల్పిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం పట్ల చుక్కల చిక్కులతో ఇక్కట్లు పడ్డ రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

శుభపరిణామం



ఎన్నో దశాబ్దాలుగా ఉన్న చుక్కల భూమి సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిష్కరించడం శుభపరిణామం. అయితే ఈ భూములు ఎవరి పేరుమీద ఉన్నాయో వారికే పట్టాలు ఇవ్వాలి. అలా కాకుండా చాలా చోట్ల అక్రమార్కులు తెరపైకి వస్తున్నారు. వారికి అడ్డుకట్ట వేసి అర్హులకే భూములు చెందేలా చూడాలి. – దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

అక్రమాలను అరికట్టాలి..



రాష్ట్ర ప్రభుత్వం చుక్కల భూములను రెగ్యులర్ చేస్తూ జీవో తేవడం చాలా సంతోషం. అయితే దీనిని కొంతమంది అధికారులు సొమ్ము చేసుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. – నాగేశ్వరరెడ్డి, రైతు, రావులపల్లె

ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు 15కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ–6) గజ్జల ఉదయ్‌కుమార్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఈ నెల 15కు వాయిదా వేసింది. ఈ కేసులో గతనెల 14న ఉదయ్‌ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టు అనుమతితో ఆరురోజులు కస్టడీలోకి తీసుకుని విచారించింది. అరెస్టయిన రెండు రోజులకే ఉదయ్‌కుమార్ సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సీబీఐ కోర్టు మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా న్యాయస్థానం ఆదేశాల మేరకు కేసు డైరీని సీబీఐ సమర్పించింది. అనంతరం వాదనలు పూర్తికావడంతో న్యాయస్థానం తీర్పును ఈ నెల 15కు వాయిదా వేసింది.

క్లుప్తంగా

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి


ఆత్మ కార్యాలయంలో పీడీ, ఏపీడీలతో చర్చిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : జిల్లావ్యాప్తంగా ఉన్న రైతాంగానికి వ్యవసాయ సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి వారి అభివృద్ధికి శాస్త్రవేత్తలు కృషి చేయాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) కార్యాలయాన్ని సందర్శించి పలు కార్యక్రమాల గురించి ఆత్మ పీడీ విజయలక్ష్మి, డీపీడీ పద్మలతతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నూతన సాంకేతిక విజ్ఞానాన్ని, మన జిల్లాకు అనుకూలమైన రకాలు, అధిక దిగుబడిని ఇచ్చే వంగడాల గురించి సైంటిస్టుల ద్వారా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఖరీఫ్, రబీలకు సంబంధించిన ప్రణాళికలను తయారు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటల సాగుకు ముందు పలు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి వారికి పంటలసాగు, కొత్త రకాల వంగడాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాలో నుంచి రూ. 2 లక్షలు మాయం

– కడప తాలూకాలో సైబర్ నేరం కేసు నమోదు

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో నబీకోటలో వున్న వరప్రసాద్ అనే విద్యార్థి బ్యాంక్ ఖాతాలో నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 2 లక్షల మేరకు డబ్బులను కాజేశారు. మొదట బాధితుడి మొబైల్ ఫోన్ హ్యాంగ్ చేసిన సైబర్ నేరగాళ్లు, తరువాత ఆ మొబైల్ ఫోన్ ఆన్‌కాగానే ఓటిపిలను పంపారు. ఆ ఓటిపి అలాగే అతని ప్రమేయం లేకుండానే ఎంటర్ కావడం, బ్యాంక్ ఖాతాలోని డబ్బులు కాజేయడం జరిగిందని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలియజేశారు.

చెరకు గానుగ.. కనుమరుగు

గణనీయంగా తగ్గిన సాగు

కురబలకోట : గ్రామాల్లో గతంలో చెరకు గానుగలు ఎక్కువగా కనిపించేవి.. చాలామంది కూలీలు పని చేస్తూ బెల్లం తయారీలో నిమగ్నం అయ్యేవారు. ఇప్పుడు చెరకు గానుగలు కనుమరుగవుతున్నాయి. ఇరవై ఏళ్ల క్రితం వరకు వేసవిలో ప్రతి ఊరిలో చెరకు సాగు..వీటి నుంచి బెల్లం తయారు చేయడానికి చెరకు గానుగలు కన్పించేవి. తొలుత ఎద్దుల గానుగలు ఆతర్వాత క్రషర్లు వచ్చాయి. బెల్లానికి ఆశించిన ధర లేక ఆపై వీటి ఎగుమతులపై ఆంక్షలు, కూలీల రేట్లు పెరగడంతో క్రమేణా చెరకు సాగుపట్ల రైతులు విముఖత చూపుతూ వస్తున్నారు. ఇప్పుడు చెరకు గానుగల సీజన్ ఆఖరి దశలో ఉంది. మండలానికి ఒకటి రెండు చోట్ల తప్ప ఎక్కడోగాని కన్పించడం లేదు. చెరకు తోట కొట్టడం, క్రషర్‌కు తీసుకు రావడం, చెరకు పాలు పెనాల్లో పోసి కాంచడం, వంట పట్టడం, దోనెల్లో బెల్లం తయారు చేయడం తలచుకుంటేనే ఆనాటి పెద్దతరం వారు వాడే గానుగలు గుర్తుకొస్తాయి.

ధర అంతంత మాత్రమే..

ఒకటిన్నర కిలో బెల్లం ముద్ద ప్రస్తుతం రూ.90 నుండి రూ.వంద ఉంది. ఒకసారి గానుగ ఆడితే మరుగోలుగా మరోసాగు వచ్చేది. ఇది ఏడాది పంట కావడం చెరకు క్రషింగ్ మిషన్లుకు విద్యుత్ చార్జీలు అధికం కావడం, కష్టం ఎక్కువ, కూలీల సమస్య, గిట్టుబాటు ధర లభ్యం కాకపోవడం, సారా నిషేధం, దీనికి తోడు ఉపాధి హామీ పథకం అమలు తదితర కారణాల వల్ల ఈ సాగు గణనీయంగా తగ్గింది.


పెనంలో బెల్లం తయారు చేస్తున్న రైతు


దోనెలో బెల్లం ముద్దలు చేస్తున్న రైతులు

దీనికి తోడు తొలుత వరి, ఆ తర్వాత టమాటా పంట రంగ ప్రవేశంతో చెరకు సాగు రైతుల నుండి దూరమవుతోంది.

గతంలో రాష్ట్రంలో ఫస్ట్

గతంలో రాష్ట్రంలోనే చెరకు సాగులో ఉమ్మడి చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉండేది. ఈసారి అన్నమయ్య జిల్లాలో 27 హెక్టార్లలో మాత్రమే సాగులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 25 వేల హెక్టార్లకు పైగా సాగులో ఉండేది. గిట్టు బాటు ధర కల్పించి ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే మళ్లీ చెరకు సాగు పట్ల రైతులు మొగ్గ చూపే అవకాశం ఉందని చెబుతున్నారు.

చెరకు గానుగ సందడి

చెరకు గానుగ అంటే ఇళ్లను తలపించేది. ఎంతో సందడిగా ఉండేది. నిరంతరం పని ఉండేది. ఓపికతో కూడుకున్న పని. పెద్దల కాలంలో ఎద్దులతో గానుగ ఆడేవారు. ఆ తర్వాత ఆయిల్ ఇంజన్లు వచ్చాయి. అనంతరం విద్యుత్‌తో నడిచే క్రషర్లు వచ్చాయి. గానుగ అంటే పిల్లలు, పెద్దలు, మహిళలతో సందడిగా కన్పించేది. చెరకు పాలు, లక్కీల బెల్లం, బెల్లం పాకం, చెక్క బెల్లం, పాకం పప్పు లాంటివి చేసేవారు. అవిప్పుడు చెప్పుకోడానికి మాటలుగా మిగిలాయి. చెరకు గానుగ ఆడటానికి ముందుగా గుట్టలకు వెళ్లి బందిరాకు సిద్ధం చేసుకునేవారు. చెరకు గానుగ నుండి వచ్చే పిప్పిని ఆరబెట్టి, వగుడుతో కలిపి చెరకు పాలు కాంచడానికి వినియోగించేవారు. క్రషర్ వద్ద, పెనం వద్ద, దోనెలవద్ద ఇలా ప్రతి చోట పని ఉండేది. బెల్లాన్ని పాకంగా దించడానికి అనుభవజ్ఞులు ఉండేవారు. రాత్రింబవళ్లు గానుగలో జాముల ప్రకారం ఆడేవారు. గానుగ ఆడుతుంటే ఎంతో దూరంలో ఉన్న వారికి కూడా ఆవాసన గుప్పుమని వచ్చేది. ఇవన్నీ ఇప్పుడు తలచుకుంటే ఆనాటి పెద్దలు ఇంత కష్టం ఎలా చేశారోనని ఆశ్చర్యం కల్గుతుంది. ఇప్పుడు అక్కడక్కడా కొందరు ఆర్గానిక్ పద్ధతిలో బెల్లం తయారు చేస్తూ దీని ఉనికి చాటుతున్నారు. ఒకప్పుడు నిమ్మకాయలు, మిరపకాయలు, మిరియాలు వేసి గానుగల వద్ద చెరకు పాలు తాగిన వారు ఇప్పుడు రోడ్డు పక్కన బండ్లపై డబ్బులిచ్చి చెరకు పాలు తాగి ఇష్టాన్ని తీర్చుకుంటున్నారు.

పోషకాలు అధికం



చక్కెర ఇతర తీపి పదార్థాల కన్నా బెల్లంలో ఐరన్ ఇతర మూలకాలు ఎక్కువ. పిండి వంటలు, నైవేద్యం, ఆయుర్వేదంలో కూడా దీన్ని వాడకం ఉంది. ఆసిడిటీని, ఆమ్ల సమతుల్యాన్ని నియంత్రిస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. అందుకే బెల్లాన్ని మెడిసినల్ (ఔషధ) షుగర్‌గా చెబుతారు. పెద్ద తరంలో ప్రతి ఇంటా బెల్లం ఉండేది. చక్కెర వచ్చాక బెల్లం వాడకం కూడా తగ్గింది. ఇప్పుడు మళ్లీ చక్కెర కన్నా బెల్లం శ్రేష్టమని వెనక్కి వస్తున్నారు. ప్రకృతి వనంలో ఆర్గానిక్ పద్ధతిలో తయారు చేసి విక్రయిస్తున్నాం. – ఎంసీవీ ప్రసాద్, ప్రకృతి వనం, సీటీఎం, మదనపల్లె మండలం

చెరకు గానుగలు సాధ్యం కాదు



రాష్ట్రంలో అనకాపల్లె అంటేనే తియ్యటి బెల్లంకు, మార్కెట్‌కు, ఎగుమతులకు ఫేమస్‌గా ఉండేది. ఇప్పుడు అక్కడ కూడా సంక్షోభం నెలకొంది. ఈ ప్రాంతాల్లో కూడా అనకాపల్లె చెరకును ఎక్కువ సాగు చేసేవారు. ఖర్చులు ఎక్కువ. బాగా చూసుకుంటున్నా కూలీలు రావడం గగనమైంది. పైగా చిత్తూరు జిల్లాలో ఆరు చక్కెర పరిశ్రమలు ఉండగా ఐదు మూతపడ్డాయి. ఇంత చేసి సాగు చేసినా గిట్టుబాటు లేదు. నష్టాలు భరించలేక కష్టార్జితం రాక 20 ఏళ్ల క్రితమే ఈ పంట సాగును వదిలేశాం. – సదానందరెడ్డి, ఆదర్శ రైతు, బైసానివారిపల్లె, కురబలకోట మండలం

స్క్రాబ్ కింద క్రషర్ అమ్మేశా



ఇదివరలో ఉమ్మడి రాష్ట్రంతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, అస్సాం తదితర ప్రాంతాలకు ఇక్కడి బెల్లం సరఫరా అయ్యేది. సాగుకు నీళ్లు ఎక్కువ కావాలి. చెరకు క్రషింగ్‌కు కూలీలు అవసరం. పైగా చక్కెర మిల్లులు కూడా దగ్గరగా లేవు. ఇదివరలో రూ.35 వేలు పెట్టి కొన్న క్రషింగ్ మిషన్ ఏళ్లుగా వృధాగా పడి ఉండడంతో ఏడేళ్ల క్రితం కిలో రూ.12 చొప్పున స్క్రాబ్ దుకాణం వారికి క్రషర్ అమ్మేశా. – కె. బూజారెడ్డి, మాజీ చెరకు రైతు, పిచ్చలవాండ్లపల్లె, కురబలకోట మండలం

ఉమ్మడి కుటుంబాలు లేక



20 ఏళ్ల క్రితం అయితే ప్రతి ఇంట్లో పది నుండి 15 మంది ఉండేవారు. కలసిమెలసి జీవించేవారు. ఎంత పనైనా ఇట్టే అయిపోయేది. కూలీలు వచ్చినా రాకున్నా ధైర్యం ఉండేది. ఉమ్మడి కుటుంబాలు లేవు. ఇప్పుడు భార్యా భర్త వారికి ఇద్దరు పిల్లలకు మించి లేరు. ఇప్పుడు ప్రతి పనికి కూలీలు అవసరం. ఎకరాకు గానుగ ఆడటానికి రూ.2 లక్షలు ఖర్చయ్యింది. చేతికి ఒకటిన్నర లక్ష మాత్రమే వచ్చింది. దీంతో ఏళ్లుగా సాగు చేస్తూ వస్తున్న చెరకు సాగు వద్దనుకుంటున్నా. – ఎన్. పెద్ద రెడ్డెమ్మ, కుమ్మరపల్లె, పిచ్చలవాండ్లపల్లె గ్రామం, కురబలకోట మండలం

పిడుగు పడి వ్యక్తి మృతి

– మరో వ్యక్తికి గాయాలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని లక్కిరెడ్డిపల్లి, రాయచోటి ప్రధాన రహదారిలో దర్గా సమీపంలో గురువారం రాత్రి పిడుగుపడి గంపల నారాయణ (55) అనే వ్యక్తి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. నారాయణ లక్కిరెడ్డిపల్లి నుంచి బాలాజీ నగర్ ఎస్సీ కాలనీలోని ఇంటికి స్కూటర్‌లో వెళ్తుండగా మెరుపులతో కూడిన గాలి, వాన వచ్చింది. ఈ క్రమంలో దర్గా సమీపంలోకి రాగానే పిడుగు పడటంతో అక్కడికక్కడే అతడు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనం నడుపుతున్న మరో వ్యక్తి సురేంద్రకు గాయాలు కాగా స్థానికులు లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పిడుగు పడి కూలిన ఇల్లు

గాలివీడు : మండల పరిధి గోపనపల్లె గ్రామం బండకింద హరిజనవాడలో పిడుగుపడి ఇల్లు కూలిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు బండకింద హరిజనవాడకు చెందిన సీతారామాంజులు తన కుటుంబ సభ్యులతో ఇంట్లో ఉన్నప్పుడు గాలలతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో పిడుగు పడడంతో ఇల్లు దెబ్బతింది. ఈ ఘటనలో కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం


పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, నిందితుడు

రాజంపేట : అక్రమ రవాణాకు సిద్ధం చేస్తున్న 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, తమిళ స్మగ్లర్‌ను అరెస్టు చేశామని రాజంపేట రేంజర్ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా రాజంపేట రేంజ్ అధికారి సమాచారం మేరకు.. రోళ్ల మడుగు బీట్‌లోని జల్లకోన ప్రదేశంలో ఎస్ ఆర్ పాలెం డీఆర్‌వో బషీర్ అహమ్మద్, రోళ్లమడుగు బీట్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, రోళ్లమడుగు బేస్ క్యాంపు ప్రొటెక్షన్ వాచర్‌లు బుధవారం రాత్రి విధులు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన స్మగ్లర్ ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా కోసం ఒక చోటికి చేరుస్తుండగా ఆ స్మగ్లర్‌ను అందుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ లభించిన 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు స్మగ్లర్‌పై కేసు నమోదు చేసుకొని ఎర్రచందనం ప్రత్యేక కోర్టులో హాజరు పరచగా నిందితుడికి 15 రోజులు రాజంపేట సబ్‌జైలుకు రిమాండుకు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ప్రారంభమైన హనుమజ్జయంతి మహోత్సవాలు


గండి వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

చక్రాయపేట : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి మహోత్సవాలలో భాగంగా ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. అనంతరం గండి వీరాంజనేయస్వామికి అనుగ్న, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షా బంధన ధారణ, వాస్తు హోమం, గోష్టి నిర్వహించడం జరిగింది. యాగ్నాచార్యులు అనంత శర్మ, ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి, వేద పండితులు రామ్మోహన శర్మ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎ.ముకుందారెడ్డి తెలిపారు.

ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులు

– జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో గురువారం ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్, రోటరీక్లబ్ ఆఫ్ అన్నమయ్య ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆకేపాటి ప్రారంభించి మాట్లాడారు. రోటరీక్లబ్ ఆఫ్ అన్నమయ్య ప్రతినిధులు ప్రజలకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పేద ప్రజలు కొన్ని ఆరోగ్య సమస్యల నుంచి దూరం కాగలరన్నారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేయించి అవసరమైన వారికి రోటరీక్లబ్ ఆఫ్ అన్నమయ్య, ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్తంగా ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తుందన్నారు. ఒకగొప్ప కార్యక్రమంలో తమ సంస్థ భాగస్వామ్యం కావడం సంతోషానిస్తుందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలంలో ఉచిత వైద్య కంటి శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మనిషికి డబ్బు, ఆస్తుల కంటే ఆరోగ్యం వెలకట్టలేని సంపద అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని తెలిపారు. అందుకే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. 104, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేసేందుకు సీఎం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలకు చెందిన వంద మందికి పైగా రోగులు పాల్గొన్నారు. వీరికి ప్రముఖ కంటివైద్య నిపుణురాలు స్వరూపారాణి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 65 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించారు. వీరికి ఆపరేషన్లు చేయించేందుకు తిరుపతిలోని ఓ కార్పోరేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఇదిలావుంటే రోగులకు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి భోజనం ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఈకార్యక్రమంలో కంటి వైద్యులు వీ.చంద్రశేఖర్‌రెడ్డి, ఆకేపాడు పీహెచ్‌సీ డాక్టర్ బ్రహ్మేంద్ర, రిటైర్డ్ సీహెచ్‌ఓ పిల్లి పిచ్చయ్య, రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య ప్రతినిధులు ఓ శివారెడ్డి, నాగా మహేష్‌రెడ్డి, జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, సూరి, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి పెంచలయ్య, అరిగె సోమిత్రిచంద్రనాథ్, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

మదనపల్లె : ఆటో బోల్తాపడి నలుగురు గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. చీకిలబైలు గ్రామానికి చెందిన జి.మంజునాథ (32), రాధ (32), పి.కాంతమ్మ (26), ఎస్.రామకృష్ణ నలుగురు కూలీపనులకై మదనపల్లెకు వచ్చేందుకు ఆటో ఎక్కారు. మార్గమధ్యలో మదనపల్లెకు సమీపంలో ఆటోకు కుక్క అడ్డుగా రావడంతో కుక్కను తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రైల్వే ప్రయాణికుల రక్షణకు కృషి


సీఐలను సత్కరిస్తున్న రైల్వే పోలీసు అధికారులు, రైల్వే అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే ప్రయాణీకుల రక్షణకు అన్ని చర్యలు చేపడతామని రైల్వే సీఐ నాగరాజు తెలిపారు. గురువారం ఆయన కడప రైల్వేస్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తాను 2004లో రైల్వే ఎస్ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించానన్నారు. 2008లో అప్పటి రాష్ట్రపతి చేతుల మీదుగా శౌర్య పతకాన్ని, 2010లో అప్పటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా శౌర్య పతకాన్ని అందుకున్నానన్నారు. 2020లో ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేశానన్నారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా సీసీఎస్ సీఐగా పనిచేస్తూ బదిలీపై కడప రైల్వే స్టేషన్ సీఐగా రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న సీఐ మహమ్మద్‌బాబాతోపాటు ప్రస్తుత సీఐ నాగరాజులను ఘనంగా సత్కరించారు. కడప స్టేషన్ మేనేజర్ డీఎస్ రెడ్డి, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, జీఆర్‌పీ ఎస్ఐలు రారాజు (కడప), వర్మ (ఎర్రగుంట్ల), రైల్వే పోలీసుల సంఘం అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు సీఐ నాగరాజును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విజయనగరం వీధిలో చోరీ


చెల్లా చెదురుగా పడి ఉన్న వస్తువులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని విజయనగరం వీధిలో చోరీ జరిగింది. బంగారు నగలను దొంగలు దోచుకొని వెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు సుభాషిణి విజయనగరం వీధిలో నివాసం ఉంటోంది. కుమార్తెతో కలసి ఆమె సోమవారం బంధువుల పెళ్లి నిమిత్తం చెన్నైకి వెళ్లింది. పెళ్లి పనులు ముగించుకొని బుధవారం రాత్రి ప్రొద్దుటూరుకు బయలుదేరారు. గురువారం ఉదయం ఇంటికి వెళ్లి చూసుకోగా ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు నగలు, డబ్బు కనిపించకపోవడంతో ఆమె వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐలు ఇబ్రహీం, యుగంధర్, ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది సంఘటనా స్థలంలో వేలి ముద్రలను సేకరించారు. వీధిలోని సీసీ కెమెరాలను పోలీసు అధికారులు పరిశీలిస్తున్నారు. సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

దుగ్గాయపల్లెలో..


చోరీ జరిగిన గృహంలో పరిశీలిస్తున్న ఎస్ఐ

వల్లూరు : వల్లూరు మండలం దుగ్గాయపల్లెలో చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన దంపతులు సిద్దం శెట్టి వెంకట సుబ్బన్న, వెంకట లక్షుమ్మలు ఈ నెల 6 వ తేదీ రాత్రి ఇంటికి తాళాలు వేసి హైదరాబాదులోని మనుమరాలు దగ్గరికి వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి దుగ్గాయపల్లెలోని ఇంటికి చేరుకోగా ఇంటి తలుపులకు వున్న తాళాలను, ఇంటిలోని బీరువా తాళాలను పగుల కొట్టి వస్తువులన్నీ పడవేసి వుండటాన్ని గుర్తించారు. బీరువాలో దాచుకున్న లక్ష నగదును దొంగిలించినట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ పెద్ద ఓబన్న సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మదనపల్లె : అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రూయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మదనపల్లెకు చెందిన షేక్ బాబ్జి (36) మృతి చెందారు. ఘటనకు కారణమైన భార్య యాస్మిన్, అత్త జైమున్నీషాలపై హత్యకేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. వివరాలు... పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన షేక్ బాబ్జికి 12 ఏళ్లక్రితం మండలంలోని డ్రైవర్స్‌కాలనీకి చెందిన యాస్మిన్‌తో పెళ్లి జరిగింది. బాబ్జి స్థానికంగా చికెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు. కొంతకాలం పాటూ సజావుగా సాగిన వీరి కాపురం తర్వాత మనస్పర్థలు రావడంతో భార్యాభర్తలు విడిపోయారు. ఈ క్రమంలో ఇటీవల మత పెద్దల సమక్షంలో తాత్కాలికంగా విడాకులు పొందారు. ఈ నేపథ్యంలో యాస్మిన్ పిల్లలతో కలిసి డ్రైవర్స్‌కాలనీలో పుట్టింటిలో ఉంటోంది. ఇదిలా ఉండగా విడాకులు పొందిన అనంతరం ఈనెల 4వ తేదీన బాబ్జి పిల్లలను చూసేందుకు అత్తగారి ఇంటికి వెళ్లాడు. అయితే విడాకులు తీసుకున్నావు కదా మళ్లీ ఎందుకు వచ్చావంటూ భార్య యాస్మిన్ ఆమె తల్లి జైమున్నీషాలు బాబ్జీతో గొడవకు దిగారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటూ హుంకుం జారీచేశారు. ఆవేశంతో బాబ్జిపై మూకుమ్మడిగా దాడి చేశారు.

అనంతరం అతనిపై పెట్రోలు పోసి నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని స్థానికులు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. స్థానిక వైద్యులసూచనల మేరకు మెరుగైన వైద్య చికిత్సలకై తిరుపతి రూయాకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం బాబ్జి మృతి చెందారు. తాలూకా సీఐ సత్యనారాయణ తిరుపతి రూయా ఆసుపత్రికి చేరుకుని బాబ్జి మృతదేహానికి పోస్టుమార్టం జరిపించారు. ఈ కేసులో నిందితులైన యాస్మిన్, జైమున్నీషాలపై హత్యకేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



ఫైనల్లో బెర్త్ కోసం బరిలో భారత బాక్సర్లు

ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ముగ్గురు భారత బాక్సర్లు కీలకపోరుకు సిద్ధమయ్యారు. తెలంగాణకు చెందిన హుసాముద్దీన్ (57 కేజీలు), హరియాణాకు చెందిన దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) సెమీఫైనల్ బౌట్‌లలో పోటీపడనున్నారు. 2022 యూరోపియన్ చాంపియన్ బిలాలా బెనామా (ఫ్రాన్స్)తో దీపక్; సైదెల్ హోర్టా (క్యూబా)తో హుసాముద్దీన్; 2022 ఆసియా చాంపియన్ అస్లాన్‌బెక్ షింబెర్గెనోవ్ (కజకిస్తాన్)తో నిశాంత్ దేవ్ తలపడతారు. సెమీఫైనల్లో గెలిస్తే ఫైనల్ చేరి స్వర్ణ-రజత పతకాల బరిలో ఉంటారు. ఓడితే కాంస్య పతకాన్ని గెల్చుకుంటారు. భారత కాలమానం ప్రకారం నేడు సాయంత్రం గం. 5:30కు దీపక్ బౌట్ ఉంది. ఆ తర్వాత హుసాముద్దీన్, నిశాంత్ దేవ్ బౌట్‌లు జరుగుతాయి. ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ఈ బౌట్‌లను ప్రత్యక్షంగా తిలకించవచ్చు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటి వరకు భారత్ నుంచి ఒక్కరే ఫైనల్‌కు అర్హత సాధించారు. 2019లో అమిత్ పంఘాల్ (52 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకం గెల్చుకున్నాడు.

సరబ్‌జోత్–దివ్య జోడీకి స్వర్ణం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్–దివ్య థడిగోల్ సుబ్బరాజు (భారత్) ద్వయం విజేతగా నిలిచింది. స్వర్ణ–రజత పతక ఫైనల్ పోరులో సరబ్‌జోత్–దివ్య జోడీ 16–14తో జొరానా ఆరునోవిచ్–దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయంపై విజయం సాధించింది. సరబ్‌జోత్ కెరీర్‌లో ఇది రెండో ప్రపంచకప్ స్వర్ణంకాగా... బెంగళూరుకు చెందిన దివ్యకు ప్రపంచకప్ టోర్నీలలో తొలి పతకం కావడం విశేషం. మొత్తం 55 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్–దివ్య ద్వయం 581 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. భారత్‌కే చెందిన ఇషా సింగ్–వరుణ్ తోమర్ జంట 578 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచి పతక మ్యాచ్‌లకు అర్హత పొందడంలో విఫలమైంది. టాప్–4లో నిలిచిన జోడీలు పతక మ్యాచ్‌లకు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో రెండు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

‘బ్లాక్‌డే’ పాటించిన రెజ్లర్లు



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్ల నిరసన జంతర్ మంతర్ వద్ద కొనసాగుతోంది. నిరసనకు 18వ రోజైన గురువారం రెజ్లర్లు ‘బ్లాక్‌డే’గా పాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీరంతా నల్ల బ్యాండ్‌లు ధరించి తమ అసంతృప్తిని ప్రదర్శించారు. ‘ఈ రోజు మేం బ్లాక్‌డే పాటించాం. దేశం మొత్తం మాకు అండగా నిలుస్తోంది కాబట్టి విజయం సాధిస్తామని నమ్ముతున్నాం. న్యాయం దక్కే వరకు మా నిరసన కొనసాగుతుంది’ అని బజరంగ్, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ అన్నారు.

శ్రీకాంత్‌కు విదేశీ కోచ్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్నాడు. ఇండోనేసియాకు చెందిన వీంపి నహార్డి ఇక నుంచి శ్రీకాంత్‌కు శిక్షణ ఇస్తాడు. 2021 డిసెంబర్‌లో భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్‌గా ఉన్న అగుస్ ద్వి సాంతోసో తిరిగి వెళ్లిపోయాక భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్ లేకుండా పోయాడు. కోచ్ కావాలని భారత స్పోర్ట్స్ అథారిటీకి గత జనవరిలో ప్రతిపాదన పంపించినా ఎలాంటి చర్యలు లేకపోవడం... ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలు మొదలుకావడంతో తానే కోచ్‌ను నియమించుకున్నానని శ్రీకాంత్ తెలిపాడు.

భారత్‌కు క్లిష్టమైన ‘డ్రా’

దోహా: ఏషియన్ కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు కఠినమైన ‘డ్రా’ ఎదురైంది. వచ్చే ఏడాది జనవరిలో ఖతర్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్ ‘బి’లో ఆస్ట్రేలియా (ప్రపంచ 29వ ర్యాంక్), ఉజ్బెకిస్తాన్ (74వ ర్యాంక్), సిరియా (90వ ర్యాంక్) జట్లతో కలిసి భారత్ (101వ ర్యాంక్) ఉంది. వచ్చే ఏడాది జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. 67 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో భారత జట్టు 1964లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత భారత్ 1984లో, 2011లో, 2019లో ఈ టోర్నీకి అర్హత సాధించినా గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

జై జైస్వాల్...

47 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98 నాటౌట్

- 9 వికెట్లతో రాజస్తాన్ ఘన విజయం
- ఈడెన్‌లో కోల్‌కతా చిత్తు
- చహల్‌కు 4 వికెట్లు



చహల్



యశస్వి జైస్వాల్

తొలి ఓవర్లో 6, 6, 4, 4, 2, 4... ఇలా దూకుడు మొదలు పెట్టిన యశస్వి జైస్వాల్ ఆగలేదు... తొలి 6 బంతుల్లో 26 పరుగులు రాబట్టిన అతను తర్వాతి 7 బంతుల్లో మరో 24 పరుగులు కొట్టేశాడు. అంతే...13 బంతుల్లో ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో కొత్త రికార్డు సృష్టించాడు. 3 ఓవర్లలోపే యశస్వి హాఫ్ సెంచరీ అయిపోయింది. మరో 3 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 78 పరుగులు. అక్కడే మ్యాచ్‌లో ఎవరు గెలవబోతున్నారో అర్థమైపోయింది! ఇక మిగిలింది యశస్వి ఎంత దూరం, ఎలా వెళతాడనేది... సెంచరీ వరకు చేరగలిగాడు కానీ రెండు పరుగుల తేడాతో శతకం చేజారింది. అయితేనేం ఐపీఎల్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడిన జైస్వాల్ రాజస్తాన్ జట్టును గెలిపించాడు... మరో ఎండ్‌లో కెప్టెన్ సామ్సన్ మెరుపు బ్యాటింగ్‌తో పని సులువైంది. రాజస్తాన్ 41 బంతులు మిగిలి ఉండగానే నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది.

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్తాన్ పండగ చేసుకుంది. నైట్‌రైడర్స్ బ్యాటింగ్ చేసినంత సేపూ నెమ్మదిగా అనిపించిన పిచ్‌పైనే పరుగులు వరద పారించి కీలక విజయాన్ని అందుకుంది. గురువారం జరిగిన పోరులో రాజస్తాన్ 9 వికెట్ల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (42 బంతుల్లో 57; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. యుజువేంద్ర చహల్ 25 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి కోల్‌కతాను కట్టడి చేశాడు. అనంతరం రాజస్తాన్ 13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 151 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 98 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (29 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగి జట్టును లక్ష్యానికి చేర్చారు.

వెంకటేశ్ అయ్యర్ బ్యాటింగ్‌ను మినహాయిస్తే కోల్‌కతా ఇన్నింగ్స్ ఆసాంతం పేలవంగా సాగింది. వెంకటేశ్ కూడా మరీ విధ్వంసకరంగా ఆడకపోయినా... పరిస్థితిని బట్టి తనవంతు పాత్ర పోషించాడు. వెంకటేశ్ 42 బంతుల్లో 57 పరుగులు చేయగా ... ఇతర ఆటగాళ్లంతా కలిసి 78 బంతుల్లో 89 పరుగులు చేయగలిగారంటే అతని ఇన్నింగ్స్ విలువ తెలుస్తుంది.

ధనాధన్...

ఆశ్చర్యకరంగా పార్ట్‌టైమ్ బౌలర్, కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా మొదటి ఓవర్ వేశాడు. ఆ ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టి ప్రత్యర్థిని యశస్వి కఠినంగా శిక్షించాడు. సమన్వయ లోపంతో జోస్ బట్లర్ (0) రనౌట్ కావడంతో రాయల్స్ తొలి వికెట్ కోల్పోయింది. అయితే జట్టుపై అది ఎలాంటి ప్రభావం చూపించలేదు. యశస్వి, సామ్సన్ కలిసి వేగం తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరి షాట్లకు నైట్‌రైడర్స్ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. సామ్సన్ 16 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను నేలపాలైంది. అనంతరం అనుకూల్ వేసిన ఓవర్లో 3 సిక్సర్లతో సామ్సన్ చెలరేగాడు. చివర్లో యశస్వి సెంచరీ విషయంలో కాస్త ఉత్కంఠ నెలకొంది. యశస్వి 94 పరుగుల వద్ద ఉండగా రాయల్స్‌కు 3 పరుగులు కావాలి. 13వ ఓవర్ చివరి బంతికి పరుగు తీయని సామ్సన్ సిక్సర్ కొట్టమన్నట్లుగా సైగ చేస్తూ యశస్వికి అవకాశం ఇచ్చాడు. అయితే తర్వాతి బంతికి ఫోర్ మాత్రమే రావడంతో యశస్వి 98 పరుగుల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది. అయితే దానిని పట్టించుకోకుండా అతను విజయానందాన్ని ప్రదర్శించాడు.

1 ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసిన క్రికెటర్‌గా యశస్వి (13 బంతుల్లో) నిలిచాడు. గతంలో ఈ రికార్డు కేఎల్ రాహుల్, కమిన్స్ (14 బంతుల్లో) పేరిట ఉంది.

187 ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చహల్ రికార్డు నెలకొల్పాడు. డ్వేన్ బ్రేవో (161 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును చహల్ (143 బంతుల్లో 187 వికెట్లు) సవరించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	0.951
చెన్నై	12	7	4	1	15	0.493
రాజస్తాన్	12	6	6	0	12	0.633
ముంబై	11	6	5	0	12	-0.255
లక్నో	11	5	5	1	11	0.294
బెంగళూరు	11	5	6	0	10	-0.345
కోల్‌కతా	12	5	7	0	10	-0.357
పంజాబ్	11	5	6	0	10	-0.441
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	11	4	7	0	8	-0.605

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) హెట్‌మైర్ (బి) బౌల్ట్ 10; గుర్బాజ్ (సి) సందీప్ శర్మ (బి) బౌల్ట్ 18; వెంకటేశ్ (సి) బౌల్ట్ (బి) చహల్ 57; నితీశ్ రాణా (సి) హెట్‌మైర్ (బి) చహల్ 22; రసెల్ (సి) అశ్విన్ (బి) ఆసిఫ్ 10; రింకూ సింగ్ (సి) రూట్ (బి) చహల్ 16; శార్దుల్ (ఎల్బీ) (బి) చహల్ 1; అనుకూల్ (నాటౌట్) 6; నరైన్ (సి) రూట్ (బి) సందీప్ 6; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 149. వికెట్ల పతనం:** 1–14, 2–29, 3–77, 4–107, 5–127, 6–129, 7–140, 8–149. **బౌలింగ్:** బౌల్ట్ 3–0–15–2, సందీప్ శర్మ 4–0–34–1, అశ్విన్ 4–0–32–0, రూట్ 2–0–14–0, యజువేంద్ర చహల్ 4–0–25–4, ఆసిఫ్ 3–0–27–1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (నాటౌట్) 98; బట్లర్ (రనౌట్) 0; సామ్సన్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 151. వికెట్ల పతనం:** 1–30. **బౌలింగ్:** నితీశ్ రాణా 1–0–26–0, హర్షిత్ రాణా 2–0–22–0, శార్దుల్ ఠాకూర్ 1.1–0–18–0, వరుణ్ చక్రవర్తి 3–0–28–0, సునీల్ నరైన్ 2–0–13–0, సుయశ్ 3–0–22–0, అనుకూల్ 1–0–20–0.

సినిమా



“ఓ నటుడుగా నన్ను నేనెప్పుడూ విమర్శించుకుంటూనే ఉంటాను... అభినందించుకోను. ఎప్పటికప్పుడు తప్పులు వెతుకుతూనే ఉంటాను.. నటుడిగా నన్ను నేను మెరుగుపరచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాను" అని అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం ‘కస్టడీ’. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగచైతన్య చెప్పిన విశేషాలు.

ఆ విషయం ఓ సవాల్‌గా మారింది

– నాగచైతన్య

- తమిళ చిత్రం ‘మానాడు’ విడుదల కాకముందే వెంకట్ ప్రభుగారు నాకు ‘కస్టడీ’ స్టోరీ చెప్పారు. అయితే ‘మానాడు’ విడుదలై, హిట్ సాధించిన తర్వాత, ఈ సినిమానే మేం తెలుగులో రీమేక్ చేస్తే బాగుంటుందన్నట్లుగా కొందరు నిర్మాతలు అభిప్రాయపడ్డారు. కానీ ‘కస్టడీ’ స్టోరీ నన్ను ఎగ్జయిట్ చేసింది. పైగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొంతవరకు పూర్తయింది. దీంతో ‘కస్టడీ’ని సెట్స్‌పైకి తీసుకెళ్లాం. ఈ సినిమాలో భాగంగా కొందరు పోలీసులను కలిశాను. వారి కథలు నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి.
- ఈ సినిమాలో నేను పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్ర చేశాను. నా కెరీర్‌లో ఎప్పుడూ చేయనటువంటి కొన్ని కొత్త యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా కోసం చేశాం. కథ రీత్యా ఈ తరహా యాక్షన్ సీక్వెన్స్‌లు అవసరం అయ్యాయి. అయితే కొన్ని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం కొంత రిహార్సల్స్ చేశాం. ఈ సినిమాలోని వాటర్ సీక్వెన్స్ కోసం మూడు రోజులు రిహార్సల్స్ చేసి, దాదాపు 15 రోజులు షూట్ చేశాం. ఈ ఎపిసోడ్ ఓ హైలైట్‌గా ఉంటుంది.
- సినిమా మొదలైన తొలి ఇరవై నిమిషాలు కూల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే స్క్రీన్‌పైకి అరవింద్ స్వామిగారు వస్తారో అప్పట్నుంచి స్టోరీ మలుపు తీసుకుని ఆడియన్స్‌ను స్క్రీన్‌పై నుంచి చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్, అరవింద్ స్వామి, ప్రియమణి వంటి సీనియర్స్ నటించారు. వారి నుంచి నేను కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఇచ్చిన డైలాగ్స్‌ను తనదైన స్టైల్లో ఇంప్రూవ్ చేసి చెబుతుంటారు అరవింద్ స్వామి గారు. ఇది నాకు చాలా కొత్తగా అనిపించింది. వెంకట్‌గారు ఏ స్క్రిప్ట్ అయితే నాకు చెప్పారో అదే తీశారు. ఆయన స్క్రీన్‌ప్లే స్టయిల్ తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది. ఈ చిత్రంలో కమర్షియల్ ఎలిమెంట్స్ స్టోరీకి తగ్గట్లుగానే ఉంటాయి. ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అవుట్‌పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నాను. పోలీస్ బ్యాక్‌డ్రాప్ సినిమాల్లో నాకు ‘ఘర్షణ’, నాన్నగారి ‘శివమణి’, ‘జేమ్స్ బాండ్’ యాక్షన్ ఫ్రాంచైజీ చిత్రాలు ఇష్టం.
- నిర్మాత శ్రీనివాసా చిట్టూరిగారు సెట్స్‌లో కూల్‌గా ఉంటారు. ‘కస్టడీ’ నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించబడింది. ఈ సినిమా 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. ఇళయరాజాగారు, యువన్ శంకర్‌రాజాగార్లు ఇచ్చిన మ్యూజిక్ ‘కస్టడీ’కి ప్లస్. ‘కస్టడీ’ని వేరే సినిమాతో పోల్చవద్దు. ‘కస్టడీ’ చిత్రం ‘కస్టడీ’యే.
- నేను తెలుగు డబ్బింగ్ కోసం దాదాపు పది రోజులు తీసుకుంటాను. కానీ తమిళ ‘కస్టడీ’ సినిమాకు డబ్బింగ్ పూర్తి చేయడానికి నెలరోజుల టైమ్ పట్టింది. నా సొంత వాయిస్ అయితే ఆడియన్స్‌కు యాక్టర్‌గా చేరువ కావొచ్చు. మన పెర్ఫార్మెన్స్ కూడా మెరుగ్గా కనిపిస్తుంది. అందుకే తమిళంలో డబ్బింగ్ చెప్పాను.
- నేను ఫలానా రకమైన సినిమాలు చేస్తేనే ఆడియన్స్‌కు నచ్చుతాయని అదే ట్రాక్‌లోకి వెళితే ఓ యాక్టర్‌గా అది నా బలహీనత అవుతుంది. ఈ విషయంలో నన్ను నేను కన్విన్స్ చేసుకోలేను. గతంలో నేను చేసిన కొన్ని లవ్‌స్టోరీలు వర్కౌట్ అయ్యాయి. అలా అని అవే సినిమాలు చేస్తుంటే ఓ యాక్టర్‌గా ఎదగలేను. చైతన్య ఎలాంటి సబ్జెక్ట్ అయినా బాగా చేస్తాడని ఆడియన్స్‌తో అనిపించుకోవాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులకు ఏ రకమైన సినిమాలు నచ్చుతున్నాయో తెలుసుకోవడం చాలెంజ్‌లా మారింది. కానీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా ఇస్తే వారి ఆదరణ ఓ రేంజ్‌లో ఉంటుంది.
- నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి త్వరలో అధికారికంగా చెబుతాను. ‘ధూత’ వెబ్ సిరీస్ రిలీజ్ అమెజాన్ చేతిలో ఉంది. ఈ ఏడాదే స్ట్రీమింగ్ స్టార్ట్ కావొచ్చు.

మా తాతగారు, నాన్నగారు గొప్ప గొప్ప సినిమాలు చేశారు. కొన్ని స్టాండర్డ్స్ క్రియేట్ చేశారు. కొందరు వారితో మాకు పోలికలు పెడుతుంటారు. అయితే ఈ విషయాన్ని నేను ఓ ప్రెజర్‌లా తీసుకోను. చాలెంజ్‌లా స్వీకరించి, నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఆ స్థాయికి నేను రీచ్ అవుతానా? లేదా అనేది నాకు తెలియదు. కానీ నా శక్తివంచన లేకుండా కష్టపడుతూనే ఉంటాను.

నా గురించిన కొన్ని వార్తలు వస్తూనే ఉన్నాయి (విడాకుల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ..). డిఫరెంట్ వార్తలు రాస్తున్నారు. కానీ ఆడియన్స్ ఫూల్స్ కాదు. తెలివైనవారు. ఏది జెన్యూన్ న్యూస్.. ఏది కాదనేది వారికి తెలుసని అనుకుంటున్నాను. నేను అయితే నవ్వుకుని వదిలేస్తున్నాను.

గేమ్ స్టార్ట్

‘ది కేరళ స్టోరీ’ వంటి వివాదాత్మక సినిమా తర్వాత హీరోయిన్ అదా శర్మ ఓ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ‘హేట్ స్టోరీ 2’ ఫేమ్ విశాల్ పాండ్య దర్శకత్వంలో శ్రేయాస్ తల్పాడే హీరోగా నటిస్తున్న చిత్రం ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’. ఈ చిత్రంలో అదా శర్మ నటిస్తున్నట్లు చిత్రయూనిట్ గురువారం ప్రకటించింది. ఇటీవల కాలంలో యువతలో బాగా ప్రాచుర్యం పొందిన ‘బ్లూ వేల్ గేమ్’ (బ్లూ వేల్ ఛాలెంజ్) నేపథ్యంలో థ్రిల్లర్‌గా ఈ కథ సాగుతుంది. ఇందులో అదా శర్మ పోలీస్ పాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ‘‘గతంలో ‘కమాండో’ సినిమాలో భావనా రెడ్డి అనే పోలీస్ పాత్ర చేశాను. ఆ పాత్ర మంచి ప్రజాదరణ పొందింది. ఇప్పుడు ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’లో గాయత్రీ భార్గవ్ అనే పోలీస్ పాత్ర చేస్తున్నాను. నా పాత్ర సరదాగా, విభిన్నంగా ఉంటుంది’’ అన్నారు.



● అదాశర్మ

ఓ సరదా ప్రయాణం



● నాగశౌర్య

నాగశౌర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘రంగబలి’. ఈ చిత్రం ద్వారా పవన్ బాసంశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎస్‌ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ‘రంగబలి’ని జూలై 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. నాగశౌర్య ట్రెండీ గెటప్‌లో కనిపిస్తున్న ఓ పోస్టర్ ద్వారా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ‘‘పల్లెటూరి నేపథ్యంలో సాగే కథతో ‘రంగబలి’ ఫన్ రైడ్ (సరదా ప్రయాణం) గా ఉండబోతోంది. ఇందులో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.. ఇందుకు ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే తెలియజేస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్ మణి.

ప్రపంచంలో జరుగుతున్నదే మళ్ళీ పెళ్లిలో చూపిస్తున్నాం

– వీకే నరేశ్


‘‘ఓ మనిషి చావు చివరి దశలో ఉన్నప్పుడు చేయాల్సిన పనులు ఏవైనా మిగిలి ఉన్నాయా? ఏమైనా ప్రదేశాలను చూడాలనుకుని చూడలేక పోయామా? మనవల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందా? అనే మూడు అంశాల గురించి ఓసారి ఆలోచిస్తాడు. కానీ ఏ మనిషి జీవితంలో అయినా ఈ మూడు ఆశలు తీరనవిగా ఉండకూడదు. ఇదే ‘మళ్ళీ పెళ్లి’ సినిమా బేసిక్ కాన్సెప్ట్’’ అన్నారు నటుడు వీకే నరేశ్. ఎమ్‌ఎస్. రాజు దర్శకత్వంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘మళ్ళీ పెళ్లి’. విజయకృష్ణా మూవీస్ పతాకంపై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో విజయకృష్ణా మూవీస్ లోగోను వీకే నరేశ్, పవిత్రాలు రీ లాంచ్ చేశారు. ఎమ్‌ఎస్ రాజు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వీకే నరేశ్ మాట్లాడుతూ– ‘‘ప్రపంచంలో జరుగుతున్న అంశాలనే ఈ చిత్రంలో బోల్డ్‌గా చూపించాం. ఇది నా జీవితానికి సంబంధించిన సబ్జెక్ట్ కాదు’’ అని అన్నారు. ‘‘సినిమాలో ఉన్నట్లే జీవితంలో కూడా ఫస్టాఫ్, సెకండాఫ్ ఉంటాయి. ఎవరైనా సెకండాఫ్ చాలా బాగుండాలని కోరుకుంటారు.. అదే ‘మళ్ళీ పెళ్లి’ కాన్సెప్ట్. ఆడియన్స్‌ను చీట్ చేయడం లేదు. తప్పుని తప్పుగానే చూపిస్తున్నాం.’’ అన్నారు ఎమ్‌ఎస్ రాజు. ‘‘ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు ఎమ్‌ఎస్ రాజుగారి నుంచి చాలా నేర్చుకున్నాను’’ అన్నారు పవిత్రా లోకేశ్. ఈ కార్యక్రమంలో సంగీతదర్శకులు సురేష్ బొబ్బిలి, అరుల్‌దేవ్, ఎడిటర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.



● నరేశ్, పవిత్రా లోకేశ్, ఎమ్‌ఎస్ రాజు

హ్యాపీ ఎండింగ్

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా నటించిన చిత్రం ‘హ్యాపీ ఎండింగ్’. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో హామ్స్ టెక్ ఫిల్మ్స్, సిల్లీ మాంక్స్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ‘‘అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా ఉంటుంది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. అజయ్ ఘోష్, విష్ణు ఓయ్, ఝాన్సీ, అనిత చౌదరి, హర్ష రోషన్, జియా శర్మ నటించిన ఈ సినిమాకు సంగీతం: రవి నిడమర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ రామానుజం.



● యశ్ పూరి

వాస్తవ ఘటనతో...

ఇషాన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘అంతం కాదిది ఆరంభం’. శక్తి మహేంద్రా, నిష్మా, ప్రణాళి హీరోయిన్స్. ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ దశరథ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. తమని ట్రాప్ చేసి, నగ్న వీడియోలు తీసి వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు? అనేదే ఈ చిత్రకథ’’ అన్నారు. సిరాజ్ మాట్లాడుతూ– ‘‘ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలతో ఇషాన్ ఈ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించాడు’’ అన్నారు. సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య, రచయిత రాంబాబు గోసాల, షేర్ స్టూడియో అధినేత దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: టి. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కర్రి మోహన్.



● నిష్మా, ఇషాన్, శక్తి

హీరో ఆఫ్ ఇండియా!



● అంకిత, కిషోర్

కిషోర్ తేజ, అంకిత మూలేర్ జంటగా ఆకుల రాఘవ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘హీరో ఆఫ్ ఇండియా’. తుమ్మలపల్లి రామసత్య నారాయణ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ లాంచ్ చేశారు. జె. భానుప్రసాద్ స్వరపరచిన మొదటి పాటని తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, రెండో పాటని నిర్మాత సాయి వెంకట్ లాంచ్ చేశారు. ‘‘తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, అమెరికాలోనూ మా సినిమాను రిలీజ్ చేస్తున్నందుకు హ్యాపీ’’ అన్నారు తుమ్మలపల్లి రామసత్యనారాయణ.